క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



రాయపర్తి : క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని వరంగల్ నెహ్రూ యువ కేంద్ర డైరెక్టర్ మచ్చ రాజు తెలిపారు. మండలం తిరుమలయపల్లిలో శనివారం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు పందెం పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. యువత క్రీడలపై దృష్టి పెట్టి ఉన్నతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ ఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రమంలో పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం శాలువా కప్పి పూలబొకే అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జన్ను నర్సయ్య, వల్లందాసు కుమార్, మల్లెపాక చంద్రమౌళి, జంగిలి భాస్కర్, చంద్రమౌళి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల బాబు మండల కేంద్రంలోని పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొలిపాక బుచ్చయ్య, నాయకులు కొమ్మ లక్ష్మయ్య, కొలగాని రవి, జన్ను రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు చోరీ

నల్లబెల్లి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ మోటారును చోరీ చేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెచ్ఎం, ఎంఈఓ వసంత కథనం ప్రకారం.. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్కూల్‌కు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు సెలవు ప్రకటించారు. శనివారం స్కూల్ ప్రారంభం కాగా మధ్యాహ్న భోజన వంట సమయంలో చోరీని గుర్తించారు. పైపు ధ్వంసం కాగా, మోటారు చోరీకి గురైంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో నగదు, ఫర్నిచర్ దగ్ధం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌కు చెందిన ధర్మారంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని నగదు, ఫర్నిచర్ దగ్ధమైంది. వివరాలిలా.. ధర్మారం ప్రాంతానికి చెందిన చాగంటి శ్రీనాథ్ కుటుంబంతో సంక్రాంతి పండుగకు ఊరెళ్లగా శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఇంట్లో ఉన్న రూ.20 వేల నగదుతోపాటు ఫ్యాన్లు, మంచాలు, ఫర్నీచర్ కాలిపోయాయి. తమకు సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని శ్రీనాథ్ వాపోయాడు.

చికెన్ షాపులను తొలగించాలని వినతి

నల్లబెల్లి : డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన చికెన్, మటన్ షాపులను తొలగించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు పరికి కోర్నెల్ ఆధ్వర్యంలోని బృందం డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్‌కు వినతిపత్రం అందజేసింది. అనంతరం కోర్నెల్ మాట్లాడారు. డ్రెయినేజీలపైనే చికెన్, మటన్ షాపులు ఏర్పాటు చేయడంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీసీ సంఘం జిల్లా కార్యదర్శి నీలం సుధాకర్, ఎమ్మార్పీఎస్ తదితరులున్నారు.

21 నుంచి గ్రామసభలు

దుగ్గొండి : మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి 25 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ లెక్కల అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. 21న చాపలబండ, గుడ్డెల్గులపల్లి, నాచినపల్లి, రేకంపల్లి, అడవిరంగాపురం, దుగ్గొండి, మహ్మదాపురంల్లో, 22న గిర్నిబావి, ముద్దునూరు, బిక్కాజిపల్లి, శివాజినగర్, రాజ్యతండా, గుడిమహేశ్వరం, మల్లిపల్లిల్లో, 23న మందపల్లి, మైసంపల్లి, పొనకల్, నారాయణ తండా, బొబ్బరోనిపల్లి, దేశాయిపల్లి, చంద్రయ్యపల్లిల్లో, 24న పీజీతండా, స్వామిరావుపల్లి, కేశవాపురం, తిమ్మంపేట, చలపర్తి, బంధంపల్లి, గొల్లపల్లిల్లో, 25న మదిర, వెంకటాపురం, రేబల్లె, తొగర్రాయి, లక్ష్మీపురం, మల్లంపల్లి గ్రామాల్లో సభలు ఉంటాయని చెప్పారు.

‘కార్పొరేట్’కు దీటుగా బోధన

- డిజిటల్ విధానంలో అవగాహన
- ‘టెన్త్’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ భవనం

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన సాగుతోంది. 1956లో పాఠశాల ఏర్పాటు కాగా నాటి నుంచి పాఠశాలలో విద్యాబోధన, మౌలిక సదుపాయాల కల్పన గణనీయంగా పెరిగింది. స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 306 కాగా 25 మంది అధ్యాపకులు పని చేస్తున్నారు. సువిశాలమైన 25 తరగతి గదులు, తరగతి గదుల్లో డెస్కులు, ఫ్యాన్లు, విద్యుత్ లైట్లతో ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొంది. స్కూల్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు సహకారంతో డిజిటల్ విద్యా విధానం అమలవుతోంది. తద్వారా విద్యార్థులు సులువుగా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం కోసం విశాలమైన డైనింగ్ హాల్‌తోపాటు విద్యార్థులకు ఆధునిక టాయిలెట్లు, రెండు సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులను మూడు సెక్షన్లుగా విభజించగా రెండు సెక్షన్లకు ఆంగ్ల మాధ్యమంలో, ఒక సెక్షన్‌కు తెలుగు మీడియం విద్యాబోధన అందుతోంది. అలాగే పదో తరగతి విద్యార్థులకు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ స్నాక్స్ అందజేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ.5 కోట్ల వ్యయంతో పాఠశాల సముదాయాన్ని నిర్మించారు.

విద్యార్థుల ఉన్నతే ధ్యేయం



విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా విద్యాబోధన అందిస్తున్నాం. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది పాఠశాల కీర్తిప్రతిష్టలు చాటేలా, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. సుమారు 34 ఏళ్ల బోధన అనుభవంతో పాఠశాల నిర్వహణ, నైపుణ్యంతో విద్యార్థుల సంఖ్యను పెంచుతున్నాం. విద్యా సముపార్జన, ఫలితాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులందరినీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నాం.

– పాక రమేశ్, హెచ్ఎం

ర్యాంపులు తొలగించాల్సిందే

- నర్సంపేట డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలపై వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకున్న ర్యాంపుల నిర్మాణాలను తొలగించాల్సిందేనని నర్సంపేట డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. ‘మూతపడ్డ కాల్వలు.. రోడ్లపై మురుగునీరు’ శీర్షికన ‘సాక్షి’లో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఎంపీఓ రవితో కలిసి డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ మండల కేంద్రంలోని డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన ర్యాంపుల నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ర్యాంపుల నిర్మాణాలు చేపట్టిన వ్యాపారులతో చర్చించారు. ర్యాంపుల నిర్మాణాల వల్ల కలిగే నష్టం, తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు. వెంటనే ర్యాంపులు తొలగించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాంపుల నిర్మాణాలు చేపట్టిన వ్యాపారస్తులందరికీ వెంటనే నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్‌ను ఆదేశించారు. 24 గంటల్లో తొలగించని వాటిని జేసీబీతో తొలగింపజేసి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెప్పారు.

సర్వేలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి



దుగ్గొండి : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



పర్వతగిరి : సీతేతండాలో..



సంగెం : కుంటపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్ : సంక్షేమ పథకాల అమలులో భాగంగా సర్వేలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సర్వే బృందాలను ఆదేశించారు. జిల్లాలోని దుగ్గొండి, పర్వతగిరి, నెక్కొండ, సంగెం, వర్ధన్నపేట మండలాల్లో సర్వేను అధికారులు శనివారం పర్యవేక్షించారు. దుగ్గొండిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి పర్యవేక్షించగా పర్వతగిరితోపాటు నెక్కొండ మండలంలో జెడ్పీ సీఈఓ గూడూరు రాంరెడ్డి, సంగెంలో జిల్లా మైనార్టీ అధికారి టి.రమేశ్, వర్ధన్నపేటలో ఎంపీడీఓ విజయ్‌సాగర్ సర్వేను పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలతో మాట్లాడారు. సర్వేకు సహకరించాలని కోరారు.

‘ఇంటర్ సిటీ’కి శాశ్వత హాల్టింగ్

- రైల్వే ఫోరం కన్వీనర్ వెంకట్‌నారాయణ



స్వీట్లు పంచుతున్న వెంకట్‌నారాయణ

నెక్కొండ : స్థానిక రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శాశ్వత హాల్టింగ్‌కు ఆదేశాలు జారీ అయ్యాయని స్థానిక రైల్వే ఫోరం కన్వీనర్ గోరంట్ల వెంకట్‌నారాయణ తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో శనివారం స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్‌నారాయణ మాట్లాడారు. ఫోరంతోపాటు రాజకీయ, ప్రజాసంఘాల వినతుల నేపథ్యంలో రైల్వే అధికారులు స్పందించారని చెప్పారు. ఇంటర్ సిటీ రైలు హాల్టింగ్ కోసం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు గటిక అజయ్‌కుమార్ బీజేపీ మంత్రులు, ఎంపీలను పలుమార్లు కలిసి ప్రయత్నించారని తెలిపారు. రాజకీయ పార్టీలు, ఫోరం కృషి ఫలితంగా ఇంటర్ సిటీ హాల్టింగ్‌కు ఆదేశాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నేతుల సారంగం, చల్లా రఘోత్తంరెడ్డి, ఈదునూరి సాయికృష్ణ, రావుల భాస్కర్ రెడ్డి, మూసిన రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.15 వేలు ఇవ్వాలి

నర్సంపేట : అర్హులకు రైతు భరోసా కింద రూ.15 వేలు చొప్పున వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చాక ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని మాట మార్చిందన్నారు. సమావేశంలో రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ మోతె జైపాల్ రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహులు, నాయకులు మచ్చిక నర్సయ్య, కొమ్మల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, కట్ల సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, ఖానాపురం, సంగెం మండలాల్లో టీడీపీ నాయకులు 29వ వర్ధంతి సందర్భంగా మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ మరియ సురేఖ, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ అడప నర్సింగరావు, తదితరులు మాట్లాడారు. వ్యవస్థాపకుడిగా, సీఎంగా ఎన్టీఆర్ అందించిన సేవలను కొనియాడారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నల్లబెల్లి/చెన్నారావుపేట : మార్క్సిస్టు నేత లెనిన్ శత వర్ధంతి కార్యక్రమ వాల్‌పోస్టర్లను నల్లబెల్లి మండలంలోని నారక్కపేటలో, చెన్నారావుపేట మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) నర్సంపేట డివిజన్ కమిటీ కార్యదర్శి అడ్డూరి రాజు శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహిస్తామన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు ధార లింగన్న, గొట్టికొప్పుల రవి, ప్రభాకర్, కత్తుల కొమురయ్య, బానోత్ జవహర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

‘న్యాయం చేయండి’

గీసుకొండ : తనకు న్యాయం చేయాలని మండలంలోని ఎలుకుర్తి హవేలీకి చెందిన అల్లూరి ప్రేమలీల ప్రభుత్వాన్ని కోరారు. తన వ్యవసాయ భూమి వద్ద శనివారం ఆమె విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో భూమి విక్రయానికి పెట్టగా గ్రామానికి చెందిన తిప్పారపు వీరయ్య రూ.16 లక్షలకు కొనుగోలు చేసుకునేందుకు ఒప్పందం చేసుకుని రూ.5 లక్షలు అడ్వాన్స్ ఇచ్చిందని తెలిపారు. మిగతా డబ్బు ఇవ్వకుండానే భూమి స్వాధీనం చేసుకుని పంట సాగు చేస్తున్నారని, పెద్ద మనుషుల నిర్ణయాన్ని సైతం వీరమ్మ ఉల్లంఘించడంతో తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయింది. ఒంటరి మహిళ అయిన తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

బాధిత మహిళలకు సేవలే లక్ష్యం

- సఖి కేంద్రం కేస్ వర్కర్ తిరుమల



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న తిరుమల, తదితరులు

ఖానాపురం : గృహహింస, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు, బాలికలకు సేవలు అందించడమే సఖి కేంద్రం లక్ష్యమని కేస్ వర్కర్ తిరుమల తెలిపారు. మండలంలోని మంగళవారిపేటలో గ్రామైక్య మహిళా సంఘాల సభ్యులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు, బాలికలు సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నట్లు తెలిపారు. డయల్ 100, 181, 1098, 14567 నంబర్లపై మహిళలు, బాలికలు అవగాహన పెంచుకుని సమస్యలు ఎదురైనప్పుడు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. తొలుత సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించేలా ముద్రించిన వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీసీ కరుణ, వీఓఏ సరోజన, ఏఎన్ఎం వినోద, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల స్థలాన్ని కాపాడాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కబ్జాకు గురి కాకుండా కాపాడాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, బీఆర్ఎస్వీ డివిజన్ నాయకుడు సదిరం వినయ్, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ నాయకులు మహేందర్, చింతం సిద్ధూ, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్ ప్రభుత్వాన్ని కోరారు. కబ్జాకు గురౌతున్నట్టు భావిస్తున్న కళాశాల స్థలం వద్ద ఆ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్, వినయ్, మహేందర్, సిద్ధూ, హేమంత్ మాట్లాడారు. కళాశాల భూమిలో కొంత భాగాన్ని సంక్రాంతి సెలవుల్లో గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ సాయంతో చదును చేసి కబ్జాకు యత్నించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్డీఓ స్పందించి కళాశాల స్థలం చుట్టూ హద్దులు ఏర్పాటు చేయించి ప్రహరీ నిర్మింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, రంజిత్, ప్రమోద్, రమ్య, శ్రీలేఖ, ప్రసాద్, ఉషాకిరణ్, రఘు, చిరంజీవి, రవీందర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హక్కులే ధ్యేయం

రాయపర్తి : రాష్ట్ర ఉద్యమకారుల హక్కుల సాధనే ధ్యేయంగా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పాలకుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిన్నపాక భద్రయ్య తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్, తదితరాలు అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నిటినీ వెంటనే అమలు చేయడంతోపాటు రూ.10 వేల కోట్లతో ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం నేడు (ఆదివారం) మానుకోటలో తలపెట్టిన పాదయాత్రకు ఉద్యమకారులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రజనీకాంత్, వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ చిలువేరు రమేశ్, మండలాల కన్వీనర్లు విజయ, ఎనగందుల శ్యాంసుందర్, నాయకులు బిరు నాగరాజు, గార కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన మొర్రి సంతోశ్ అవినాశ్ విద్యాసంస్థల్లో బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు అందుకోగా ఆయన్ను తోటి అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు శనివారం అభినందించారు. అవినాశ్ విద్యాసంస్థల వరంగల్ బ్రాంచ్‌లో సంతోశ్ సీఏ అకడమిక్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన అందించిన సేవలను గుర్తించి చైర్మన్ అవినాశ్ కళాశాల వార్షికోత్సవంలో భాగంగా బెస్ట్ ఫ్యాకల్టీ, బెస్ట్ కౌన్సిలర్ అవార్డును హైదరాబాద్‌లో అందజేశారు.

సాంస్కృతిక ప్రదర్శనను జయప్రదం చేయాలి

పర్వతగిరి : మండల కేంద్రంలో ఈనెల 20న తలపెట్టిన సాంస్కృతిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధులు మాసాని గోపాల్, జిల్లా ధర్మయ్య కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆ సంఘం మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య అధ్యక్షత వహించగా గోపాల్, ధర్మయ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సాంస్కృతిక ప్రదర్శనకు గ్రామానికి 20 డప్పులకు తగ్గకుండా రావాలని కోరారు. సమావేశంలో నాయకులు చిన్నపాక శ్రీనివాస్, జంగిలి బాబు, దబ్బెట నర్సయ్య, మధు, భాస్కర్, నరుకుడు రవి, వల్లందాస్ వెంకన్న, మాసాని వెంకట్, మాసాని పురుషోత్తం, మాసాని శ్రీనివాస్, డెక్క అశోక్, గద్దం కృష్ణ, ప్రవీణ్, కనకరాజు, చిన్నపెల్లి శ్రీకాంత్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

సంగెం : ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఆశాలపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండి యాకయ్య (70) ఈనెల 15న బాత్‌రూంలో ఉరేసుకోగా కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎంలో చేర్పించారు. కాగా యాకయ్య చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

గజ్జెలు, టీ షర్టుల బహూకరణ

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సంగెం గాంధీ అతడి తాత, నానమ్మ పెంటయ్య–ఐలమ్మ జ్ఞాపకార్థం డప్పు కళాకారులకు శనివారం టీ షర్టులు, 12 జతల గజ్జెలు బహూకరించారు. ఈ సందర్భంగా కళాకారులు గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సంగెం రమేశ్, ఓరుగంటి అశోక్, నూనె చిన్న భాస్కర్, బోడ విజేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సంగెం : మండలంలోని పల్లారుగూడకు చెందిన మహేశ్వరం సబ్‌స్టేషన్ ఆర్టిజన్ కార్మికుడు గుగులోతు కృష్ణ గత నెల విద్యాదాఘాతానికి గురై మృతి చెందగా అతడి చిన్ననాటి స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం అందజేశారు. అతడితో కలిసి భద్రాచలంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న స్నేహితులు సమకూర్చిన డబ్బును కృష్ణ స్నేహితులు కోట దామోదర్, రాజు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి బాండ్ ప్రతాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు.

రేషన్ డీలర్ కుటుంబానికి...

మండలంలోని పల్లారుగూడకు చెందిన గౌడ సంఘం సభ్యుడు, రేషన్ డీలర్ కక్కెర్ల సమ్మయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి గౌడ సంఘం తరఫున అధ్యక్షుడు కక్కెర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు సాయం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొమ్మ దామోదర్, కోటేశం, జూలూరి అశోక్, డైరెక్టర్లు చీకటి కృష్ణ, బొల్లికొండ శివ, కక్కెర్ల సదానందం, బొమ్మ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ నాయకులపై వ్యాఖ్యలు సరికాదు’



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్ఎస్ నాయకులపై అధికార పార్టీ నాయకుల వ్యాఖ్యలు సరికాదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రైతు సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి అన్నారు. నర్సంపేట అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చొరవతో బీఆర్ఎస్ హయాంలో తీర్మాణాలు చేసిన పనులే ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్నాయని చెప్పారు. అధికారులను గుప్పిట్లో ఉంచుకుని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్న నాయకులకు బీఆర్ఎస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. పట్టణంలో కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్న వారిని బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాస్తవాలు ప్రజలకు అర్థమవుతాయని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, క్లస్టర్ బాధ్యుడు బండి రమేశ్, ప్రధాన కార్యదర్శి వెన్నుముద్దల శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనర్సయ్య

ఖానాపురం : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన పేదలకు రూ.12 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి రానున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. హామీలు అమలు చేయకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆబోతు అశోక్, రాజు, కాస ప్రవీణ్‌కుమార్, అశోక్, మౌలానా, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



సంగెం : బెల్లం పానకాన్ని పారబోస్తున్న టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

సంగెం : మండలంలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ సీఐ స్వరూప వివరాలు వెల్లడించారు. మండలంలోని వాల్యానాయక్ తండ, చింతలపల్లి, ఎల్గూర్ స్టేషన్ తదితర గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 1200 లీటర్ల బెల్లం పానకాన్ని, సామగ్రిని ధ్వంసం చేసినట్టు తెలిపారు. వాల్యానాయక్ తండాకు చెందిన బాదావత్ రాధ, బాదావత్ రాజేశ్‌లపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్ చందర్, ఎక్సైజ్ ఎస్సై సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని తోపనిగడ్డతండా, ఇందిరా తండాల్లో ఎక్సైజ్ శాఖ, సివిల్ పోలీసులు దాడులు నిర్వహించారు. 400 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి 16 గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి పాల్పడిన బోడ బుజ్జి, లకావత్ రేణుక, గుగులోతు వెంకన్న, భూక్య రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట : తన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని ఉప్పరపల్లికి చెందిన చల్ల రాఘవరెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన అందె శంకర్ దంపతులు తన మొక్కజొన్న పంట కోసి రూ.50 వేల నష్టం చేశారని ఆరోపించారు.